## మినీకథ

# నవోదయం

మంగళంపల్లి శుభప్రద




నడుస్తున్నాను. ఎక్కడికో గమ్యం లేదు.

నేను వేస్తున్న ప్రతీ అడుగు మాత్రం ఒక క్రొత్త అనుభవాన్ని చవిచూపిస్తున్నట్లుంది. చుట్టూఉన్న ప్రకృతి నేను నిత్యం చూసే ప్రకృతిలా లేదు. చెట్లు- పక్షులూ పరస్పరంపలకరించుకుంటున్నట్లున్నాయి. గున్న మావి కమ్మని పల్లవాలను పరచి కోకిలమ్మను రమ్మని పిలుస్తోంది. తల్లి మల్లె ఉదయకాంతులకు బెదిరిపోతున్న తన మొగ్గ సంతానాన్ని బుజ్జగిస్తోంది. పిల్లగాలిని ముద్దచామంతులు తమ సువాసనలతో సత్కరిస్తున్నాయి

ఎంత భేదం కనబడుతోంది! ఈ మార్పు నాలోనా! పరిసరాలలోనా.... ఏమో!

ఇంటిలోకన్నతల్లి దగ్గరనుంచి—వీధిలో రిక్షావాని వరకూ అందరూ స్వార్థపరుల కూటమి! అబ్బబ్బ! తలచుకుంటేనే ఏవగింపు! అమ్మ నన్ను ఉదయాన్నే లేపి పనుల పూర్తి చేసుకోమని తొందర పెట్టినా, నాన్న బయట నలుగురి దగ్గర నన్ను పొగడి మాట్లాడినా, మంచం మీదున్న మామ్మ ఏ సాయంకాలమో — ఓసారి నన్ను పలకరించినా, అందులో వాళ్ళ వాళ్ళ స్వార్థమే నాకు ప్రధానంగా కనబడేది! చివరకు పక్షి కూసినా — చెట్టు పూసినా, "అది వాని స్వప్రయోజనం కోసమే" అన్నభావం నాలో స్థిర పడిపోయింది. ఆ స్వార్థపూరిత మనస్తత్వాల మధ్య మనుగడ సాగించలేక, నిస్వార్థమయిన జగత్తులోకి పయనించాలనే ఆకాంక్షతో- ఇంటినుంచి ఈవిధంగా ఒంటరిగా బయలుదేరిన నాకు ఏదో క్రొత్తలోకం ఎదురయినట్లే ఉంది.

ఈ క్రొత్త అనుభూతుల మైకంలో— మత్తుగా నడుస్తున్న నేను ఎదుట అల్లంత దూరంలో కనబడిన దృశ్యానికి ప్రమాన్పడిపోయాను. మానవ సమాజంనుంచి పారిపోదామని బయలుదేరిన నాకు మళ్ళీ యిళ్ళు— వాకిళ్ళతో ఓ పెద్ద ఊరు కనబడింది. పలచ పలచగా జన సంచారం కూడా కనబడుతోంది.

సంకోచంగానే అడుగులో అడుగేస్తూ నడుస్తున్నాను. నాకు క్రమక్రమంగా దగ్గరవుతున్న ఆ ఇళ్ళూ మనుష్యులూ చాల అపూర్వంగా తోచారు. ఇళ్ళన్నీ గాజుతో చేయబడినట్లు సూర్యకాంతిలో ధగధగా మెరుస్తున్నాయి. మనుష్యులు నిర్ణీతమయిన ఆకారాలు లేని కాంతి పుంజాలుగా వెలుగుతున్నారు. కొంపతీసి ఏదయినా భూతాల లోకం లోకి రాలేదు కదా అనే అనుమానం కూడా వచ్చింది. ఆ అనుమానం మనస్సులోకి రాగానే - మెదడు పని చేయడం మానేసింది. గుండె వేగం హెచ్చింది. గమన వేగం తగ్గింది

ఈ దృశ్యానికే అబ్బురపడుతున్న నేను "ఎవరు వారు" అని ఓ కేక వినబడడంతో అదిరిపడ్డాను. కలయజూస్తే చుట్టూ ఎవరూ కనబడలేదు కాని- ఓ వంద గజాల దూరంలో మాత్రం ఓ ముదుసలి మనిషి ఆకారం తల వంచుకొని కూర్చున్నట్లు కనబడింది. వెనుదిరిగి వుండడం వల్ల ముఖం చూడ వీలుకాలేదు కాని, ఆ ఆకారం ధ్యానంలోఉన్న ఒక ఋషిదై ఉంటుందని ఊహించాను.

ఇంతలోనే "ఎవరు నువ్వు? అలా మీది మీదికి త్రొక్కుకుంటూ వచ్చేస్తున్నావు! స్వార్థం కరడుకట్టిన నువ్వు ఈ ప్రశాంత సముద్రాన్ని ఓ గట్టిరాయిలా స్పృశించి ఎలా కల్లోల తరంగాలు లేపావో చూడు!" అంటూ నావైపైనా తిరక్కుండానే మళ్ళీ చేయెత్తి చూపిందా ఆకారం!

ఈమారు నా అనుమానం తీరింది. ఆ ఆకారం నన్ను వెనుకనుంచే చూడ గలిగింది. కనుక ఇది భూతాలుండే ఒక అభూత ప్రపంచమే అని నిశ్చయించుకున్నాను

నాలో స్వార్థం కరడు కట్టిందా! ఆ భూతం మాటలు నాకు విచిత్రంగా తోచాయి. ఇక్కడ కాస్త ప్రశాంతత చిక్కిందని నేనానందిస్తూ వుంటే, తమ ప్రశాంతతను నేను భగ్నం చేశానని నన్ను వెనక్కి నెట్టేస్తున్న ఈ లోకస్థుల స్వార్థం వాయుస్థితిలో ఉన్నట్లా అని నవ్వుకున్నాను.

అది పసికట్టాడో— ఏమో- ఆ వ్యక్తి "నవ్వకు! ఇతరులతో నాకుండే సంబంధం స్వార్థమో, పరార్థమో ఎవరు నిర్ణయిస్తారు! ఎట్లా నిర్ణయిస్తావు? ఏది ప్రమాణం?— స్వ—పరాలు ఇచ్చిపుచ్చుకునే సంబంధం లాంటివి. ఒక వస్తువు స్థానంమారితే అది

ఇవ్వబడ్డట్లా? పుచ్చుకోబడినట్లా?.... రెండూను! చూసేదృష్టినిబట్టి ఉంటుంది.

కాని - నన్ను త్రొక్కుతున్నావు - కనబడ్డంలేదా! వెనక్కినడు" అని కసిరినట్లు కేక పెట్టేసరికి — గతుక్కుమని రెండడుగులు వెనక్కివేశాను. వేశానేకాని నేనింక దూరాన వుండగా - పదే పదే తనను త్రొక్కుతున్నానన్న ఆ మాట మాత్రం నాకు బాగా తొట్రుపాటు కలిగించింది.

మనసు దిటవుపరచుకొని ఆలోచించాను.

"మనిషి స్వార్థానికి మొదట్లో తన శరీరావరణం అవధిగా వుంటుంది. దానిని స్పృశించినప్పుడు మాత్రమే అతని స్వార్థం దెబ్బ తింటుంది. ఈ 'స్వ' అనేది క్రమంగా మనస్సునకుచెందినదిగా మారి విస్తృతమయ్యేసరికి. దాని వలయంలోకి కుటుంబం. సమాజం. జాతి. దేశం అన్నీ వచ్చేస్తాయి. అందుచేతే దేశభక్తులూ. సమాజ సేవకులూ మూర్తీభవించిన స్వార్థపరులని నా నిర్వచనం.... కాని తన శరీరావరణాన్నే యింత దూరాన ఉన్న నా వరకూ పెంచుకున్న యిక్కడి మనిషి స్వార్థం...."

అని నేనేమేమో అనుకుంటూ ఉండగానే నా అంతరంగంలోకి తొంగి చూసినట్లుగా అవ్యక్తి "బంగారుపాపకు-మనస్సు. శరీరం వీటిని విడివిడిగా చూసుకునే వాళ్ళకు మాత్రమే ఈ ఆవరణ భేదాలు. అయినా 'స్వార్థం' అనేదాని వలయం— దాని పరిధి— విస్తృతి అంటూ మాట్లాడే నువ్వు దాని కేంద్రం గురించి ఆలోచించావా? కేంద్రంలేని పరిధికి అర్థంఏమిటి? ఉనికి ఎక్కడ? పరుల స్వార్థం గురించి నువ్వెప్పుడు మాట్లాడినా. నువ్వు కేంద్రంగా వుండి మాట్లాడుతున్నావన్న సంగతి నీకు తెలియదు. నీ దృష్టి మారితే, కేంద్రంగా వున్న నువ్వు పరిధి మీది బిందువులతో ఏకీభవించిపోతావు. అప్పుడు పరిధి అనంతం వరకూ వ్యాపించినా పరిధి- కేంద్రాల ప్రసక్తిపోతుంది....

అటు చూడు! ఎదురుగా నీకు కనబడే ఆ మనుష్యులంతా కేంద్రాలులేనిపరిధులు. నేనిక్కడ కేంద్రంగా నీకు కనబడుతున్నా పరిధిమీద— నీదగ్గర- కూడా ఉన్నాను. అందుకే నువ్వు నన్ను స్పృశించగలుగుతున్నావు! వెనక్కిపో! పోయి నిన్ను నువ్వు బాగా తరచి చూసుకో! ఒక చిన్న వృత్తానికి కేంద్రంగా ఉంటావో- అనంతమయిన పరిధిమీది బిందువులలో విలీనమైపోతావో ఆలోచించుకో! ఫో!" అని గదిమినట్లయింది.

అగద్దింపు విద్యుద్ఘాతంలా తగిలినట్లయి ఉలిక్కిపడ్డాను. మెలకువ వచ్చింది. స్వప్నమంతా ఇంకా పచ్చి పచ్చిగా మనస్సులో మెదులుతోంది. దానిని తలచుకుంటూంటే ఈనాడే నాకు నిజమయిన మెలకువ వచ్చిందనిపించింది.

అమ్మ,నాన్నల సంభాషణవినిపిస్తోంది.


"కాస్సేపు పడుకోనివ్వు" అంటున్నారు నాన్న.

"ఇంకా ఏం పడకండి. పరీక్షలు దగ్గిరకొస్తూంటేనూ!" అంటూ అమ్మ నా మంచం దగ్గరున్న కిటికీ తెరిచింది.

అరుణోదయ కాంతులు కంటిమీద పడ్డాయి.

"ఈవేళ నాకు నవోదయం" అనుకుంటూ దగ్గరగా నిలబడివున్న అమ్మను అమాంతం కౌగిలించుకున్నాను! ●

(ఆలిండియా రేడియో, విజయవాడ సౌజన్యంతో.)

జీవితం చాలా అపురూపమైనది జీవించండి దర్జాగా

బ్రిల్ క్రీమ్ హెయిర్ డ్రెసింగ్
మీ జీవనశైలికి వన్నె తెస్తుంది.

ఉచితం!

మీ సొంత శైలిని రూపొందించుకోండి.
"హౌ టు లుక్ స్మార్ట్ అండ్ ఫీల్ కాన్ఫిడెంట్" అన్న
మా చిన్న పుస్తకం కోసం వ్రాయండి. జాడీ మూత లోపలి కార్కుతోపాటు
50 పైసల స్టాంపు జతపరిచి, ఈ క్రింది చిరునామాకు పంపండి.
హెచ్. ఎమ్. ఎమ్. లిమిటెడ్, డిపార్ట్‌మెంట్ AJW, 1 జైసింగ్ రోడ్, న్యూ ఢిల్లీ-110001
పుస్తకం అందేందుకు, దయచేసి 4 వారాలు వ్యవధి ఇవ్వండి.




OBM/5829Tel